ట్రంప్ 'ట్రేడ్ వార్'

- కెనడా, మెక్సికో, చైనాపై టారిఫ్‌ల మోత
- ప్రతీకార చర్యగా యూఎస్ ఉత్పత్తులపై సుంకాలు విధించిన డ్రాగన్, కెనడా దేశాలు
- ట్రంప్ చర్యలతో ఆసియా మార్కెట్లు కుదేలు
- టారిఫ్‌లతో అధ్యక్షుడి చెలగాటం: వారెన్ బఫెట్

(స్పెషల్ టాస్క్ బ్యూరో)

హైదరాబాద్, మార్చి 4 (నమస్తే తెలంగాణ): సుంకాల విషయంలో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తీసుకొంటున్న నిర్ణయాలు ట్రేడ్ వార్‌కు దారితీస్తున్నది. కెనడా, మెక్సికో దిగుమతులపై 25 శాతం సుంకాలు ఉంటాయని ఇదివరకే ప్రకటించిన ట్రంప్.. తాజాగా డ్రాగన్ దేశం చైనాకు కూడా గట్టి షాక్ ఇచ్చారు. ఇప్పటికే చైనా ఉత్పత్తులపై 10 శాతం సుంకాలు విధించిన ఆయన.. తాజాగా దాన్ని 20 శాతానికి పెంచారు. ఈ మేరకు కార్యనిర్వహణ ఉత్తర్వులపై ట్రంప్ సంతకాలు చేశారు. ఫెంటనిల్ డ్రగ్స్ అక్రమ రవాణాను అడ్డుకోవడంలో చైనా విఫలమవ్వడం వల్లే టారిఫ్‌లను రెట్టింపు చేస్తున్నట్టు వెల్లడించారు. ఇక, కెనడా, మెక్సికో దిగుమతులపై గతంలో ప్రకటించిన 25 శాతం సుంకాల నిర్ణయంపై ఎలాంటి మార్పులేదని ట్రంప్ తేల్చిచెప్పారు. మార్చి 4 (అమెరికా కాలమానం ప్రకారం..) నుంచి ఈ టారిఫ్‌లు అమల్లోకి వస్తాయన్నారు. ఫెంటనిల్ డ్రగ్స్, అక్రమ వలసదారులను నియంత్రించడంలో మెక్సికో, కెనడా ఫెయిలైయ్యాయన్న ట్రంప్.. తన తాజా నిర్ణయంతో అమెరికాకు కంపెనీలు, పరిశ్రమలు క్యూ కడతాయని ఆశాభావం వ్యక్తం చేశారు.

ప్రతీకార చర్యలు

అమెరికా టారిఫ్ ప్రకటనలపై చైనా, కెనడా తీవ్రంగా స్పందించాయి. తాము కూడా అమెరికా ఉత్పత్తులపై సుంకాల మోత మోగిస్తున్నట్టు ప్రకటించాయి. అమెరికా నుంచి దిగుమతి చేసుకొంటున్న వస్తువులపై 10 శాతం నుంచి 15 శాతం సుంకాలు విధిస్తున్నట్టు చైనా ప్రకటించింది. సోయాబీన్, పోర్క్, డెయిరీ ఉత్పత్తులు, బీఫ్, చేపలు, పండ్లు, కూరగాయలు తదితర వస్తువులపై 10 శాతం, చికెన్, గోధుమ, మక్కజొన్న, పత్తి తదితరాలపై 15 శాతం సుంకాలు విధిస్తున్నట్టు డ్రాగన్ పేర్కొంది. మార్చి 10వ తేదీ నుంచి ఈ టారిఫ్ రేట్లు అమల్లోకి వస్తాయని తెలిపింది. అమెరికా చర్యలను ప్రపంచ వాణిజ్య సంస్థ (డబ్ల్యూటీవో) వేదికగా ఎండగడతామన్న చైనా.. న్యాయపరమైన చర్యలను తీసుకోనున్నట్టు హెచ్చరించింది. ఇక, అమెరికా నుంచి దిగుమతి చేసుకొనే ఆల్కహాల్, పండ్లు వంటి 155 బిలియన్ డాలర్ల విలువైన ఉత్పత్తులపై 25 శాతం సుంకాలు విధిస్తున్నట్టు కెనడా ప్రకటించింది. మంగళవారం నుంచే ఈ నిర్ణయం అమల్లోకి వచ్చినట్టు వెల్లడించింది. అమెరికాపై ప్రతీకార సుంకాలు విధిస్తామని మెక్సికో కూడా తాజాగా ప్రకటించింది.

యుద్ధ చర్యలే..

ట్రంప్ మొదలుపెట్టిన ట్రేడ్ వార్ ప్రమాదకరమైందని అమెరికాకు చెందిన దిగ్గజ ఇన్వెస్టర్ వారెన్ బఫెట్ అభిప్రాయపడ్డారు. ట్రంప్ నిర్ణయాలు దుందుడుకు చర్యలుగా అభివర్ణించారు. సుంకాలు విధించడం ఓ విధంగా యుద్ధ చర్యలేనన్న బఫెట్.. ట్రంప్ చర్యలతో 918 బిలియన్ డాలర్ల విలువైన అమెరికా దిగుమతులపై ప్రభావం పడొచ్చని పేర్కొన్నారు.

మార్కెట్లలో అనిశ్చితి

ట్రంప్ టారిఫ్ నిర్ణయాలతో ప్రపంచవ్యాప్తంగా ముఖ్యంగా ఆసియా మార్కెట్లు గత కొన్నిరోజులుగా తీవ్ర గడ్డు పరిస్థితులను ఎదుర్కొంటున్నాయి. ఉక్రెయిన్-రష్యా యుద్ధం, మధ్యప్రాచ్యంలో అనిశ్చితి, వాతావరణ మార్పులు, ప్రపంచవ్యాప్తంగా లేఆఫ్‌లు ఒకవైపు కొనసాగుతుండగా ఇంకోవైపు ప్రపంచ దేశాలపై ట్రంప్ ట్రేడ్ వార్‌కు దిగుతుండటంతో మార్కెట్లు నష్టాలతో కొనసాగుతున్నాయి. జపాన్‌కు చెందిన నిక్కీ, హాంకాంగ్‌లోని హాంగ్ సెంగ్, ఆస్ట్రేలియాలోని ఏఎస్ఎక్స్ సహా దేశంలోని సెన్సెక్స్ సూచీలు పడిపోయి గత కొన్ని రోజులుగా మదుపర్లు లక్షల కోట్ల సంపదను కోల్పోతుండటం తెలిసిందే. ట్రంప్ టారిఫ్ ప్రకటనలతో అమెరికాలోని ఎస్ అండ్ పీ సూచీలు కూడా ఒడిదొడుకులను ఎదుర్కొంటున్నాయి.

'బరువెక్కుతున్న' భారత్

భారత్ ఊబకాయుల నిలయంగా మారుతున్నదని లాన్సెట్ నివేదిక హెచ్చరించింది. 2050 నాటికి దేశంలో 45 కోట్ల మంది ఊబకాయులు ఉంటారని అంచనా వేసింది. అదే సమయంలో ప్రపంచవ్యాప్తంగా సగానికి పైగా వయోజనులు ఊబకాయం బారినపడతారని తేల్చింది. 2021లో చైనా తర్వాత భారత్‌లోనే స్థూలకాయులు ఎక్కువగా ఉన్నారని తెలిపింది. పిండి పదార్థాలు, తీపి పదార్థాలను తినడం తగ్గించి, ప్రొటీన్లను ఎక్కువగా తీసుకోకపోతే యువత, పిల్లలు స్థూలకాయం బారిన పడే ప్రమాదం మరింత పెరుగుతుందని హెచ్చరించింది.



ప్రపంచవ్యాప్తంగా యువత, పిల్లల్లో ఊబకాయులు 36 కోట్లు

చైనాలో స్థూలకాయులు - 62.7 కోట్లు

అమెరికాలో స్థూలకాయులు 21.4 కోట్లు

గత 30 ఏండ్లలో ప్రపంచవ్యాప్తంగా పిల్లలు, వయోజనుల్లో ఊబకాయుల సంఖ్యలో పెరుగుదల 244%

2055 నాటికి ప్రపంచవ్యాప్తంగా పిల్లలు, వయోజనుల్లో ఊబకాయుల సంఖ్యలో పెరుగుదల 121%

'అనర్హత వేటు పడిన నేతల వివరాలివ్వండి'

న్యూఢిల్లీ: క్రిమినల్ కేసులో దోషిగా తేలిన రాజకీయ నాయకులు ఎంత మందిని ఎన్నికల్లో పోటీ చేయకుండా అనర్హులుగా ప్రకటించిందీ లేదా అనర్హత కాలాన్ని తగ్గించిందీ వంటి వివరాలు అందచేయాలని సుప్రీంకోర్టు మంగళవారం ఎన్నికల కమిషన్‌ను ఆదేశించింది. ప్రజాప్రాతినిధ్య చట్టం(ఆర్‌పీఏ) 11 సెక్షన్ కింద ఎన్ని కేసుల్లో తన అధికారాన్ని ఉపయోగించిందీ రెండు వారాల్లో తెలపాలంది. ఆర్‌పీఏ కింద క్రిమినల్ కేసులో దోషిగా తేలిన వ్యక్తి ఎన్నికల్లో పాల్గొనకుండా అనర్హత వేటుకు గురయ్యే కాలం ఆయా నేరాల తీవ్రతను బట్టి ఉంటుంది.

ఉక్రెయిన్‌కు సైనిక సాయం నిలిపివేత

తక్షణ అమలుకు ట్రంప్ ఆదేశం

వాషింగ్టన్, మార్చి 4: ఉక్రెయిన్‌కు అమెరికా సైనిక సహాయాన్ని తాత్కాలికంగా తక్షణమే నిలిపివేస్తున్నట్టు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రకటించారు. వైట్ హౌస్‌లోని అధ్యక్ష కార్యాలయంలో ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీతో వాగ్యుద్ధం జరిగిన మూడు రోజులకే ట్రంప్ నుంచి ఈ ప్రకటన రావడం గమనార్హం. ఉక్రెయిన్‌కు తాత్కాలికంగా సైనిక సహాయాన్ని పూర్తిగా నిలిపివేయాలని, ఈ ఉత్తర్వులు తక్షణమే అమలులోకి వస్తాయని ట్రంప్ ఆదేశించినట్టు అమెరికా ప్రభుత్వంలోని సీనియర్ అధికారి ఒకరిని ఉటంకిస్తూ ది న్యూయార్క్ టైమ్స్ మంగళవారం తెలిపింది. అమెరికా అధ్యక్షుడికి, జాతీయ భద్రతా విభాగానికి చెందిన సీనియర్ నాయకులకు మధ్య వరుస సమావేశాల అనంతరం ఈ నిర్ణయం వెలువడినట్టు పత్రిక తెలిపింది. రష్యాతో శాంతి చర్చలకు ఉక్రెయిన్ తన చిత్తశుద్ధిని నిరూపించుకోనంతవరకు ట్రంప్ తీసుకున్న ఈ నిర్ణయం

అమలులో ఉంటుందని ఆ అధికారి వెల్లడించినట్లు పత్రిక తెలిపింది. అమెరికా రక్షణ కంపెనీల నుంచి నూతన సైనిక పరికరాలను ఉక్రెయిన్ కొనుగోలు చేయడానికి ఉద్దేశించిన లక్షల కోట్ల డాలర్ల భద్రతా సాయం కూడా ట్రంప్ ఉత్తర్వుల ఫలితంగా నిలిచిపోయినట్టు పత్రిక వివరించింది.

ఉక్రెయిన్ ఆగ్రహం

రష్యా డిమాండ్లకు తాము తలొగ్గే పరిస్థితిని కల్పించేందుకే తమకు అన్ని రకాల సైనిక సహాయాన్ని ట్రంప్ ప్రభుత్వం తాత్కాలికంగా నిలిపివేసిందని ఉక్రెయిన్ సీనియర్ పార్లమెంట్ సభ్యుడు ఒకరు స్పష్టం చేశారు. ఇప్పుడు సైనిక సాయాన్ని నిలిపివేయడమంటే రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్‌కు సాయపడడమేనని ఉక్రెయిన్ పార్లమెంటరీ విదేశీ వ్యవహారాల కమిటీ చైర్మన్ ఒలెక్సాండర్ మెరెజ్‌కో తెలిపారు. అమెరికా తీసుకున్న ఈ నిర్ణయం చాలా బాధాకరమని, రష్యా డిమాండ్లకు తాము తలొగ్గాలన్న ఉద్దేశం ఇందులో దాగి ఉందని ఆయన చెప్పారు. మానసికంగా, రాజకీయంగా ఉక్రెయిన్‌కు చావు దెబ్బని ఆయన వర్ణించారు. ఇది తమ స్ఫూర్తికి ఏమాత్రం దోహదపడదని ఆయన చెప్పారు. జెకొస్లోవేకియాలోని కొంత భాగాన్ని నాజీ జర్మనీ కలుపుకోవడానికి అనుమతినిస్తూ జరిగిన 1938 నాటి మ్యూనిచ్ ఒప్పందంతో తాజా పరిణామాన్ని ఆయన పోలుస్తూ మ్యూనిచ్ కన్నా ఇది అత్యంత దారుణమైనదని చెప్పారు. అక్కడ జెకోస్లోవేకియాను దురాక్రమణదారుగా చిత్రీకరించే ప్రయత్నం జరగలేదని, కాని ఇప్పుడు బాధిత దేశాన్ని దురాక్రమణదారుగా ఆరోపిస్తున్నారని, ఇది అత్యంత ప్రమాదకరమని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.

ఈయూ రక్షణకు 73 లక్షల కోట్లు!

- 'రీఆర్మ్ యూరప్' పేరిట భారీ ప్యాకేజీ
- ఈయూ కార్యనిర్వాహక అధిపతి ప్రతిపాదన
- అమెరికా విరమణ ప్రభావం తగ్గింపే లక్ష్యం

ఈయూ ప్రధాన కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతున్న ఉర్సులా

బ్రసెల్స్, మార్చి 4: యూరోపియన్ యూనియన్ (ఈయూ) దేశాల్లో రక్షణ వ్యవస్థలను బలోపేతం చేసేందుకు మంగళవారం ఈయూ కార్యనిర్వాహక అధిపతి 800 బిలియన్ యూరోలతో (దాదాపు రూ.73,29,538 కోట్ల)తో భారీ ప్రణాళికను ప్రతిపాదించారు. అమెరికా విరమణ వల్ల యూరప్‌పై పడే ప్రభావాన్ని తగ్గించడంతోపాటు ఉక్రెయిన్‌కు సైనిక బలాన్ని అందించడమే లక్ష్యంగా రూపొందించిన ఈ భారీ ప్రణాళికను ఈయూలోని 27 సభ్య దేశాల నేతల ముందు ఉంచుతామని యూరోపియన్ కమిషన్ ప్రెసిడెంట్ ఉర్సులా వాన్‌డెర్ లెయెన్ ప్రకటించారు. ఉక్రెయిన్‌కు సైనిక సాయాన్ని నిలిపివేయాలని మంగళవారం ఉదయం ట్రంప్ నిర్ణయం తీసుకోవడానికి ముందే ఆమె ఈ ప్రణాళికను తెరపైకి తీసుకురావడం గమనార్హం. వాషింగ్టన్ నుంచి రాజకీయ అనిశ్చితి పెరుగడంతోపాటు యూరప్‌తో పొత్తును, ఉక్రెయిన్ రక్షణను అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రశ్నించిన నేపథ్యంలో ఈయూ నేతలు గురువారం బ్రసెల్స్‌లో అత్యవసర సమావేశాన్ని నిర్వహించనున్నారు. దశాబ్దాల నుంచి అమెరికా అణు ఛత్రం కింద కొనసాగుతున్న ఈయూ దేశాలు ఆర్థిక మందగమనం వల్ల రక్షణ రంగానికి అధిక మొత్తంలో నిధులు వెచ్చించని విషయం తెలిసిందే. కానీ, ఇప్పుడు రక్షణ వ్యయాన్ని వేగంగా పెంచాల్సి రావడం ఆ దేశాలకు సమస్యాత్మకంగా మారనున్నది.

రణరంగంగా సెర్బియా పార్లమెంట్

సెర్బియా పార్లమెంట్ మంగళవారం రణరంగాన్ని తలపించింది. అధికార, విపక్ష సభ్యులు ఒకరిపై ఒకరు దాడి చేసుకున్నారు. ఘర్షణలో ముగ్గురు సభ్యులు గాయపడ్డారు. నిరుడు రైల్వేస్టేషన్‌పై కప్పు కూలి 15 మంది మరణించారు. దీంతో ప్రభుత్వ అవినీతికి వ్యతిరేకంగా విద్యార్థులు పెద్ద ఎత్తున నిరసనలు చేపట్టారు. నిరసనలకు మద్దతుగా మంగళవారం విపక్ష సభ్యులు సభలో స్మోక్ గ్రనేడ్లను విసిరారు. దీంతో ఘర్షణ తలెత్తింది.

మహారాష్ట్ర మంత్రి ముండే రాజీనామా

ముంబై, మార్చి 4 (నమస్తే తెలంగాణ): మహారాష్ట్ర మంత్రి ధనంజయ్ ముండే మంగళవారం తన పదవికి రాజీనామా చేశారు. నిరుడు డిసెంబర్‌లో బీడ్ జిల్లాకు చెందిన సర్పంచ్ సంతోష్ దేశ్‌ముఖ్ హత్య కేసుకు సంబంధించిన ఫొటోలు, వీడియోలు వెలుగులోకి రావడంతో ఆయన తన పదవికి రాజీనామా చేశారు. ఆయన రాజీనామాను సీఎం ఫడ్నవీస్ ఆమోదించి, గవర్నర్‌కు పంపినట్టు తెలిపారు. వైద్యపరమైన కారణాలతో తాను రాజీనామా చేసినట్లు ధనంజయ్ ట్వీట్ చేశారు. కేజ్ తాలుకాలోని మస్సాజోగ్ సర్పంచ్‌గా ఉన్న సంతోష్ దేశ్‌ముఖ్‌ను కొందరు దుండగులు అతి కిరాతకంగా నరికి చంపారు. ఆ హత్య కేసులో వాల్మీక్ కరాడ్ ప్రధాన సూత్రధారి అని దర్యాప్తు సంస్థ పేర్కొంది. వాల్మీక్ కరాడ్ నా ప్రత్యేకమైన మనిషి అని గతంలో ముండే స్వయంగా అంగీకరించాడు. హత్యకు సంబంధించిన ఫొటోలు, వీడియోలు లీక్ కావడంతో ధనంజయ్ ముండే రాజీనామా చేశారు.

సోషల్ ఖాతాలపై 'ఐ'టీ!

- ఐటీ విభాగానికి విస్తృత అధికారాలు కల్పిస్తూ చట్ట సవరణ
- ఈ-మెయిల్స్, సామాజిక మాధ్యమ ఖాతాలు, ఇతర ఆన్‌లైన్ కార్యకలాపాలను తనిఖీ చేసే అధికారం
- వ్యక్తిగత గోప్యతకు భంగం కలగవచ్చంటున్న నిపుణులు

న్యూఢిల్లీ, మార్చి 4: పన్ను ఎగవేతదారుల ఆటకట్టించేందుకు ఆదాయపన్ను (ఐటీ) చట్టాన్ని ప్రభుత్వం మరింత పటిష్ఠం చేయనుంది. ఆర్థిక లావాదేవీలలో డిజిటలైజేషన్ విధానం పెరుగుతున్న నేపథ్యంలో ఐటీ చట్టాన్ని తదనుగుణంగా ఆధునీకరించనున్నది. ఈ మేరకు ఐటీ చట్టాన్ని సవరిస్తూ ప్రభుత్వం ఐటీ బిల్లును ప్రతిపాదించనున్నది. ఈ బిల్లు ప్రకారం ఇంతవరకు ఇండ్లు, కార్యాలయాలలో మాత్రమే సోదాలు నిర్వహించిన ఐటీ అధికారులకు ఎవరైనా పన్ను ఎగవేస్తున్నారన్న అనుమానం కలిగితే వారి ఈమెయిల్స్, బ్యాంక్ ఖాతాలు, వాణిజ్య లావాదేవీలను కూడా తనిఖీచేసే అధికారం లభించనుంది. ఐటీ చట్టాన్ని ప్రభుత్వం వర్చువల్ డిజిటల్ స్పేస్ (వీడీఎస్)కు కూడా విస్తరించనుంది. వీడీఎస్‌లో సామాజిక మాధ్యమాలు, ఈమెయిల్ సర్వర్లు, ఆన్‌లైన్ బ్యాంక్, పెట్టుబడులు, ట్రేడింగ్ అకౌంట్లు, క్లౌడ్ సర్వర్లు, డిజిటల్ యాప్స్, ఇతర ఆన్‌లైన్ వేదికలన్నింటినీ చేర్చింది. పన్ను ఎగవేస్తున్నారన్న అనుమానం కలిగితే వారి ఆన్‌లైన్ కార్యకలాపాలన్నింటినీ తనిఖీ చేసే అధికారం ఐటీ విభాగానికి కల్పించింది. ఐటీ విభాగానికి చెందిన జాయింట్ డైరెక్టరు, అడిషనల్ కమిషనర్లు, ఆదాయపు పన్ను అధికారుల స్థాయి ఉన్న వారికి మాత్రమే ఆన్‌లైన్ తనిఖీలు చేసే అధికారం కల్పించనుంది.

గోప్యత హక్కుకు భంగం

ఆదాయపు పన్ను శాఖకు కల్పించనున్న అధికారాలు పౌరుల ప్రాథమిక హక్కుకు భంగం కలిగించే విధంగా ఉన్నాయని న్యాయ నిపుణులు అభిప్రాయపడుతున్నారు. చట్టపరమైన పర్యవేక్షణ లేదా విధానపరమైన రక్షణ లేకపోతే, ఈ కొత్త చట్టం దుర్వినియోగమయ్యే అవకాశాలు అధికంగా ఉంటాయని హెచ్చరించారు. ఓ సంస్థకు చెందిన అధికారిపై విచారణ జరిపే క్రమంలో ఐటీ శాఖ ఆ కంపెనీకి చెందిన కీలకమైన సమాచారాన్ని పొందే అవకాశం లేకపోలేదని అంటున్నారు. తమ అంతర్గత కమ్యూనికేషన్లను, ఆర్థిక రికార్డులు ఇక బహిరంగమవుతాయని వ్యాపార వర్గాలు భావిస్తున్నాయి. ప్రభుత్వం పన్ను విధానాన్ని ఆధునీకరించడం, నల్లధనాన్ని వెలికితీయడం లక్ష్యంగా ఈ చట్టాన్ని తెస్తున్నప్పటికీ, చట్టబద్ధమైన రక్షణలు లేకుండా ఐటీ శాఖకు విస్తృత అధికారాలు కల్పించడం ద్వారా గోప్యతల ఉల్లంఘనకు, ఏకపక్ష నిఘాకు దారి తీస్తుందని నిపుణులు అభిప్రాయపడుతున్నారు.

రూ.10 కోసం తండ్రిని నరికి.. తలతో పోలీస్ స్టేషన్‌కు!

భువనేశ్వర్: ఒడిశాలో 40 ఏండ్ల వ్యక్తి కేవలం 10 రూపాయల కోసం కన్నతండ్రిని కిరాతకంగా నరికి చంపాడు. అనంతరం తెగిన తలను పట్టుకొని వెళ్లి పోలీస్ స్టేషన్లో లొంగిపోయాడు. గుట్కా, పొగాకు కొనేందుకు తండ్రి డబ్బులు ఇవ్వలేదని ఈ కిరాతకానికి పాల్పడ్డాడని పోలీసులు చెబుతున్నారు. ఈ ఘటన మంగళవారం ఒడిశాలోని మయూర్‌భంజ్ జిల్లా బరిపాద గ్రామంలో జరిగింది.

15 కిలోల బంగారం స్మగ్లింగ్..

కన్నడ నటి అరెస్ట్

బెంగళూరు, మార్చి 4: కన్నడ నటి రాన్యా రావును బెంగళూరు విమానాశ్రయంలో రెవెన్యూ ఇంటెలిజెన్స్ అధికారులు సోమవారం అదుపులోకి తీసుకొన్నారు. ఆమె నుంచి 14.8 కిలోల బంగారాన్ని సీజ్ చేశారు. గత 15 రోజుల్లో ఆమె నాలుగుసార్లు దుబాయ్ వెళ్లడాన్ని గమనించిన అధికారులు ఆమెపై నిఘా ఉంచారు. ఓ ఐపీఎస్ అధికారికి ఆమె దగ్గరి బంధువని వారు తెలిపారు. ఆమె ఎయిర్‌పోర్టులో దిగినప్పుడల్లా తాను డీజీపీ కూతురునని ప్రచారం చేసుకొనేదని తేలింది. ఇందులో అధికారుల పాత్రపైనా దర్యాప్తు చేస్తున్నారు.

వనతారలో ప్రధాని మోదీ

గుజరాత్ జామ్‌నగర్‌లో ప్రముఖ పారిశ్రామికవేత్త ముఖేశ్ అంబానీకి చెందిన వన్యప్రాణుల రక్షణ, పునరావాసం, సంరక్షణ కేంద్రమైన 'వనతార'ను ప్రధాని మోదీ మంగళవారం ప్రారంభించారు. అక్కడి పరిసరాలను సందర్శించారు. వనతారలో పునరావాసం పొందుతున్న వివిధ జాతుల జంతువులతో ఆయన సన్నిహితంగా మెలిగారు.

గంటకు 3,00,000 కిలోమీటర్లు

- 30-60 రోజుల్లోనే మార్స్‌కు!
- అత్యంత వేగంగా పయనించే రాకెట్ ఇంజిన్
- అభివృద్ధి చేసిన రష్యా
- 2030 నాటికి అందుబాటులోకి

మాస్కో, మార్చి 4: రష్యా అద్భుతాన్ని ఆవిష్కరించింది. అంతరిక్ష పరిశోధనల్లో ఎంతగానో ఉపయోగపడే అత్యంత వేగవంతమైన రాకెట్ ఇంజిన్‌ను అభివృద్ధి చేసింది. రష్యా ప్రభుత్వ సంస్థ న్యూక్లీయర్ కార్పొరేషన్ రోసాటామ్ అభివృద్ధి చేసిన ప్లాస్మా ఎలక్ట్రిక్ రాకెట్ ఇంజిన్ గంటకు 3,13,822 కిలోమీటర్ల వేగంతో పయనిస్తుంది. అత్యంత వేగంగా పయనించే ఈ రాకెట్ ఇంజిన్ భూమి నుంచి మార్స్ గ్రహానికి ప్రయాణ సమయాన్ని గణనీయంగా తగ్గిస్తుంది. ప్రస్తుతం అందుబాటులో ఉన్న మిషన్ల సాయంతో మార్స్‌కు వెళ్లాంటే సుమారు ఏడాది సమయం పడుతుండగా.. ప్లాస్మా ఎలక్ట్రిక్ రాకెట్ ఇంజిన్ సాయంతో 30-60 రోజుల్లోనే అంగారకుడిపైకి చేరుకోవచ్చు. ఇంధనాన్ని మండించడం ద్వారా పని చేసే సంప్రదాయ రసాయన రాకెట్ల వలె కాకుండా.. విద్యుత్తు క్షేత్రాన్ని ఉపయోగించి అయాన్లను వేగవంతం చేయడం ద్వారా ఈ ఇంజిన్ పని చేస్తుంది. హైడ్రోజన్ ఇంధన సాయంతో పని చేసే ఈ రాకెట్ ఇంజిన్ సుదీర్ఘ మిషన్లకు ఎంతగానో ఉపయోగపడుతుంది. ఈ టెక్నాలజీ ఇంకా అభివృద్ధి దశలోనే ఉన్నది. దీన్ని 2030 నాటికి అందుబాటులోకి తీసుకురావాలని రోసాటామ్ ప్రణాళికలు రచిస్తున్నది. అయితే, ఈ ఇంజిన్‌కు కావాల్సిన ఇంధనాన్ని సమకూర్చడం ప్రతికూలంగా మారవచ్చు. అందుకోసం న్యూక్లీయర్ రియాక్టర్ల అవసరం పడవచ్చు.

భవిష్యత్తు పరిశోధనలకు కీలకం

ఇటలీ, ఐరోపా సమాఖ్య కూడా ఇలాంటి హైప్రొపల్షన్ సిస్టమ్ అభివృద్ధిపై అధ్యయనం చేస్తున్నాయి. ఇలాంటి ప్లాస్మా ఇంజిన్లు భవిష్యత్తులో స్పేస్ మిషన్లకు కేంద్రంగా మారే అవకాశం ఉందని అంతరిక్ష నిపుణులు అంచనా వేస్తున్నారు. మార్స్‌తోపాటు సుదూర అంతరిక్ష పరిశోధనలకు ఇది కీలకం కావచ్చని భావిస్తున్నారు.

ప్లాస్మా ఇంజిన్ వేగం- 3,13,822 కిలోమీటర్లు/గంట (1,95,000 మైళ్లు)

ఇంజిన్ పవర్- 300 కిలోవాట్

మార్స్‌కు చేరుకోవడానికి పట్టే సమయం- 30 నుంచి 60 రోజులు

ప్రస్తుతం పడుతున్న సమయం- ఒక సంవత్సరం

ఎప్పుడు అందుబాటులోకి వస్తుంది- 2030 నాటికి

ఉపయోగాలు:

- దీని ద్వారా వేగంగా ప్రయాణించవచ్చు.
- ప్రయోగ సమయాల్లో ఇంధన బరువు తగ్గుతుంది.
- కాస్మిక్ రేడియేషన్‌కు తక్కువగా గురి కావడం.
- అతి తక్కువ సమయంలో అంతరిక్ష మిషన్ల పూర్తి.
- వ్యోమగాములు అతితక్కువ కాలం అంతరిక్షంలో ఉండే వెసులుబాటు కలుగుతుంది.
- అనారోగ్య సమస్యలు కూడా తగ్గుతాయి.



ఉత్తరాదిలో మూడో భాష ఏది?

కేంద్రాన్ని నిలదీసిన స్టాలిన్

చెన్నై: దక్షిణాది రాష్ట్రాలపై హిందీ, సంస్కృత భాషలను రుద్దేందుకు కేంద్రం ప్రయత్నిస్తోందంటూ విస్తృతంగా చర్చ సాగుతున్న నేపథ్యంలో తమిళనాడు సీఎం స్టాలిన్ త్రిభాషా విధానంపై తన వ్యతిరేకతను ఉధృతం చేశారు. ఉత్తరాది రాష్ట్రాలలో ఈ విధానాన్ని ఎందుకు అమలు చేయడం లేదని ఆయన కేంద్రాన్ని సూటిగా ప్రశ్నించారు. హిందీని వ్యతిరేకిస్తున్న తనపై వస్తున్న విమర్శలను ఆయన ప్రస్తావిస్తూ ఉత్తరాదిలో మూడో భాషగా ఏ భాషను బోధిస్తున్నారో చెప్పాలంటూ విమర్శకులను ప్రశ్నించారు. ప్రజలను తప్పుదారి పట్టించే విధానాలను పరిరక్షించే కొందరు మేధావులు మూడో భాషను నేర్చుకునే అవకాశాన్ని తమిళనాడు విద్యార్థులకు ఎందుకు ఇవ్వడం లేదంటూ ఎంతో ఆవేదనతో తనను ప్రశ్నిస్తున్నారని స్టాలిన్ పేర్కొన్నారు. వారిని తాను సూటిగా ఓ ప్రశ్న అడుగుతున్నానని, ఉత్తర భారతంలో మూడో భాషగా ఏ భాషను బోధిస్తున్నారో చెప్పాలని డీఎంకే అధినేత నిలదీశారు.

ఖర్గేతో డీకే శివకుమార్ భేటీ

సీఎం మార్పు ఊహాగానాల నేపథ్యంలో ప్రాధాన్యం

బెంగళూరు, మార్చి 4: కర్ణాటకలో నాయకత్వం మార్పుపై జోరుగా ఊహాగానాలు సాగుతున్న తరుణంలో కర్ణాటక ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్ మంగళవారం నాడిక్కడ కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేను కలుసుకున్నారు. కర్ణాటక ముఖ్యమంత్రిగా డీకే శివకుమార్ బాధ్యతలు చేపట్టకుండా ఎవరూ అడ్డుకోలేరంటూ కాంగ్రెస్ సీనియర్ నాయకుడు వీరప్ప మొయిలీ ప్రకటించిన నేపథ్యంలో ఖర్గేతో డీకే సమావేశం కావడం ప్రాధాన్యం సంతరించుకుంది. తాను మర్యాదపూర్వకంగా ఖర్గేను కలుసుకున్నట్టు డీకే విలేకరులకు వివరించారు. బెంగళూరులో కాంగ్రెస్ పార్టీ నూతన కార్యాలయ శంకుస్థాపనకు ఖర్గేను ఆహ్వానించినట్టు ఆయన చెప్పారు.

ముడా కేసును సీబీఐకి అప్పగించండి

కర్ణాటక కాంగ్రెస్ ముఖ్యమంత్రి సిద్ధరామయ్యను మైసూర్ అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ (ముడా) కుంభకోణం వెంటాడుతూనే ఉంది. సామాజిక కార్యకర్త స్నేహమయి కృష్ణ ఈ కుంభకోణాన్ని సీబీఐతో దర్యాప్తు చేయించాలని మరోసారి హైకోర్టును ఆశ్రయించారు. తాజాగా రివిజన్ పిటిషన్ దాఖలు చేశారు. కాగా, ముడా నుంచి 14 ఫ్లాట్లను అక్రమంగా పొందారన్న ఆరోపణలపై సిద్ధరామయ్య, ఆయన భార్య పార్వతిలకు లోకాయుక్త క్లీన్ చిట్ ఇచ్చింది.

తాగి వేధిస్తున్నాడంటూ చెప్పుతో కొట్టింది!

డ్రైవర్‌పై అస్సాం మాజీ సీఎం కూతురు ప్రజోయిత దాడి

గువాహటి : అస్సాం మాజీ సీఎం ప్రఫుల్ల కుమార్ మహంత కూతురు ప్రజోయిత కశ్యప్ తన కారు డ్రైవర్‌ను చెప్పుతో కొట్టారు. మద్యం మత్తులో తనను తిట్టినందుకే అతడిని కొట్టానని ఆమె తెలిపారు. మోకాళ్లపై కూర్చొన్న ఓ వ్యక్తిని ఆమె దుర్భాషలాడుతూ చెప్పుతో కొట్టినట్టు ఒక వీడియో క్లిప్‌లో కనిపించింది. రాష్ట్ర రాజధాని దిస్పూర్‌లోని ఎమ్మెల్యే హాస్టల్‌లో పలువురు చూస్తుండగా ఈ ఘటన జరిగింది. తాను దాడి చేసిన డ్రైవర్ తమ కుటుంబం దగ్గర చాలా కాలంగా పని చేస్తున్నాడని కశ్యప్ తెలిపింది. 'అతడెప్పుడూ తాగి నాపై కామెంట్స్ చేస్తుంటాడు. ఇలా చేయొద్దని అతడికి చెప్పి చూశాం. కానీ అతడు వినలేదు. ఇవాళ అతడు పరిధి దాటి ప్రవర్తించి మా ఇంటి తలుపులు తట్టాడు' అని ఆమె వెల్లడించారు. ఈ విషయమై పోలీసులకు ఎందుకు ఫిర్యాదు చేయలేదన్న ప్రశ్నకు ఆమె సమాధానం దాట